
సాక్షి
గుంటూరు
మంగళవారం । 1 । ఏప్రిల్ । 2025



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి సోమవారం చిలకలూరిపేట గణపవరానికి చెందిన గ్రంథి శ్రీనివాసరావు కుటుంబం రూ. 1,01,116 విరాళాన్ని అందించింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 519.70 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 4,050 క్యూసెక్కులు విడుదలవుతోంది.

వైభవంగా పోలేరు తల్లి తిరునాళ్ల



రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడులో గ్రామ దేవత పోలేరు తల్లి తిరునాళ్లను సోమవారం నిర్వహించారు. గ్రామస్తులు పొంగళ్లు చేసి నైవేద్యంగా సమర్పించారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త చాగంటి శ్రీనివాసరెడ్డి, సభ్యులు పర్యవేక్షించారు.

న్యూస్‌రీల్

నగర పరిసరాల్లో జిల్లా ఎస్పీ పర్యటన



నగరంపాలెం: గుంటూరు నగర పరిసర ప్రాంతాల్లో సోమవారం జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆకస్మికంగా పర్యటించారు. క్షేత్రస్థాయిలో పోలీస్ అధికారులు, సిబ్బంది విధినిర్వహణ తీరును జిల్లా ఎస్పీ పరిశీలించారు. పట్టాభిపురం పీఎస్ పరిధిలోని పట్టాభిపురం, కొబాల్డ్‌పేట మసీదులు, లాలాపేట పీఎస్ పరిధిలోని ఎత్తురోడ్డు మసీదు, పాతగుంటూరు పీఎస్ పరిధిలోని ఆంధ్ర ముస్లిం కళాశాల, నగరంపాలెం పీఎస్ పరిధిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రి సమీపంలోని ఈద్గాల వద్ద నెలకొల్పిన బందోబస్తును పరిశీలించారు. ఎవరికి ఇబ్బందులు తలెత్తకుండా ప్రార్థనలు ముగిసే వరకు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. ప్రార్థనలు ముగిశాక ట్రాఫిక్ ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ పోలీసులకు సూచించారు. రంజాన్ పర్వదిన సందర్భంగా మసీదులు, ఈద్గాల వద్ద ముస్లిం సోదరులు ప్రశాంత వాతావరణంలో ప్రార్థనలు చేసుకునేలా ఆయా ప్రాంతాల్లో పోలీస్ అధికారులు, సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ వెంట సీఐలు ఎ.అశోక్‌కుమార్ (తూర్పు ట్రాఫిక్ పీఎస్), సింగయ్య (పశ్చిమ ట్రాఫిక్ పీఎస్), వైవీ.సోమయ్య (పాతగుంటూరు పీఎస్), పోలీస్ అధికారులు ఉన్నారు.

నేడు యథావిధిగా టెన్త్ సోషల్ స్టడీస్ పరీక్ష

గుంటూరు ఎడ్యుకేషన్: రంజాన్ పండుగ సెలవు కారణంగా వాయిదా పడిన 10వ తరగతి సోషల్ స్టడీస్ పరీక్ష మంగళవారం యథావిధిగా జరుగుతుందని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం మంగళవారం ఆప్షనల్ హాలిడేగా ప్రకటించినప్పటికీ, టెన్త్ సోషల్ పరీక్ష జరుగుతుందని తెలిపారు. మంగళవారం గుంటూరు జిల్లా వ్యాప్తంగా 150 కేంద్రాల పరిధిలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరిగే సోషల్ స్టడీస్ పరీక్షకు విద్యార్థులు హాజరయ్యే విధంగా చూడాలని ఆయా ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, తల్లిదండ్రులకు సూచించారు.

జెస్సీరాజ్‌కు పతకాలు



మంగళగిరి: ఈనెల 26 నుంచి 31 వరకు తైవాన్‌లో జరిగిన తైవాన్ ఇంటర్నేషనల్ చాంపియన్ షిప్ స్కేటింగ్ పోటీలలో మంగళగిరికి చెందిన జెస్సీరాజ్ అద్భుత ప్రతిభ కనపరిచింది. సోలో డ్యాన్స్, కపుల్ డ్యాన్స్ విభాగాలలో రెండు గోల్డ్ మెడల్స్, పెయిర్ స్కేటింగ్‌లో సిల్వర్, ఇన్ లైన్ ఫ్రీ స్టైల్‌లో బ్రాంజ్ మెడల్ సాధించింది. సోమవారం జెస్సీరాజ్‌కు ఏషియన్ ఆర్టిస్ట్ స్కేటింగ్ చైర్మన్ అలెక్స్ వాంగ్ పతకాలు అందజేసి అభినందించారు.

ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట బందోబస్తు

బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడీ



చినగంజాం: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటనలో భాగంగా పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. జిల్లా ఎస్పీ సోమవారం చినగంజాం మండలం కొత్త గొల్లపాలెం గ్రామంలో పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మంగళవారం మొత్తం 904 మంది పోలీసులతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని వీరిలో ఒకరు అడిషనల్ ఎస్పీ, ఏడుగురు డీఎస్పీలు, 27 మంది సీఐలు, 67 మంది ఎస్ఐలు ఉన్నారన్నారు. మొత్తం బందోబస్తును 11 సెక్టార్లుగా విభజించామన్నారు. అధికారులు, సిబ్బంది వారికి కేటాయించిన ప్రదేశాలలో అప్రమత్తంగా వ్యవహరిస్తూ సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్, బాపట్ల, చీరాల, రేపల్లె సీసీఎస్ డీఎస్పీలు రామాంజనేయులు, మొయిన్,శ్రీనివాసరావు, జగదీష్ నాయక్‌లు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ నారాయణ, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

సంతోషాల రంజాన్

రంజాన్ పర్వదినాన్ని సోమవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఫలితంగా జిల్లావ్యాప్తంగా మసీదులు, ఈద్గాలు కళకళలాడాయి. ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేసి ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వేసవి దృష్ట్యా మసీదులు, ఈద్గాల వద్ద షామియానాలు వేశారు. తాగునీటి సదుపాయం కల్పించారు. భక్తులు ఇబ్బంది పడకుండా పలుచోట్ల కూలర్లు కూడా ఏర్పాటు చేశారు. గుంటూరు నగరంలోని పలు మసీదులను విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. ఇదిలా ఉంటే కొన్నిచోట్ల ముస్లింలు కేంద్ర ప్రభుత్వం చేయనున్న వక్ఫ్ సవరణ చట్టం బిల్లును వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు. నల్లరిబ్బన్లు చేతికి ధరించి ప్రార్థనల్లో పాల్గొన్నారు. – నగరంపాలెం(గుంటూరు వెస్ట్)





కార్మికులపై కూటమి కత్తి

- 60ఏళ్లు దాటిన వారిని విధుల నుంచి తొలగింపు
- పారిశుద్ధ్య విభాగంలో 103 మందికి ఉద్వాసన
- ఇంజినీరింగ్ విభాగంలో 39 మంది తొలగింపు
- గత ప్రభుత్వ హయాంలో 60 ఏళ్లు నిండితే కుటుంబ సభ్యులకు అవకాశం
- ఇప్పుడు ఆ అవకాశం లేదని అధికారుల స్పష్టీకరణ



నగరపాలక సంస్థలో జారీ చేసిన ఉత్తర్వు

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్) కూటమి ప్రభుత్వం కార్మికుల పొట్ట కొడుతోంది. ఆప్కాస్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ సిబ్బంది వందల మందిని 60 ఏళ్ల వయసు దాటిందనే సాకుతో విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో శ్రామిక వర్గం నిరసన గళం వినిపిస్తోంది.

వైఎస్సార్ సీపీ హయాంలో కుటుంబ సభ్యులకు అవకాశం

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో 103 మంది పారిశుద్ధ్య, 39 మంది ఇంజినీరింగ్ కార్మికులను కూటమి ప్రభుత్వం విధుల నుంచి తొలగించింది. గత వైఎస్సార్ సీపీ పాలనలో 60 ఏళ్ళు వయసు నిండిన వారి స్థానంలో కుటుంబ సభ్యులకు అవకాశం కల్పించారు. దీంతోపాటు ఆప్కాస్ పద్ధతిలో పనిచేస్తూ విధి నిర్వహణలో మరణించిన వారి కుటుంబ సభ్యులకూ ఉద్యోగాలు ఇచ్చారు. కానీ కూటమి ప్రభుత్వంలో ఆప్కాస్ పద్ధతిలో పనిచేస్తూ మరణించిన వారి కుటుంబ సభ్యులకు ఎటువంటి ఉద్యోగం ఇవ్వడం లేదు.. 60 ఏళ్లు పూర్తయిన వారి స్థానంలో వారి కుటుంబ సభ్యులకు అవకాశం ఇవ్వడం లేదు. దీంతో ప్రభుత్వ విధానంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

పోస్టులు అమ్ముకునేందుకే కుట్ర!

2025 మార్చి 31కి 142 మందిని విధుల నుంచి తొలగించాలని నగరపాలక సంస్థలోని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఇంజినీర్ అధికారులకు జాబితాతో కూడిన సర్క్యులర్‌ను ఉన్నతాధికారులు జారీ చేశారు. జాబితాలో ఉన్న కార్మికులను మంగళవారం నుంచి విధులకు రానివ్వద్దంటూ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పోస్టులు అమ్ముకునేందుకే కూటమి ప్రభుత్వం 60 ఏళ్ల వయసు దాటిన వారిని విధుల నుంచి తొలగిస్తోందని కార్మిక సంఘాల నాయకులు మండిపడుతున్నారు.

కార్మికులపై కక్ష సాధింపు చర్యలు



గుంటూరు నగరపాలక సంస్థలో 60 ఏళ్లు పూర్తయిన పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ కార్మికులను అర్ధాంతరంగా విధుల నుంచి తొలగించడం దారుణం. పనిచేసిన కాలానికి గ్రాట్యూటీ అమలు చేయకుండా కనీస పెన్షన్ ఇవ్వకుండా వారిని ఇంటికి పొమ్మనడం తగదు. ఇది ముమ్మాటికీ కక్ష సాధింపు చర్యే. ఇప్పటికైనా సర్కారు గ్రాట్యూటీ చెల్లించి కనీసం పెన్షన్ రూ.5,000 ఇవ్వాలి. తొలగించిన కార్మికుల కుటుంబ సభ్యులకు అవకాశం కల్పించాలి.

–బందెల రవికుమార్, ఏఐటీయుసి జిల్లా ప్రధాన కార్యదర్శి

జోరుగా రిజిస్ట్రేషన్లు.. భారీగా ఆదాయం



మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

మంగళగిరి టౌన్: మంగళగిరిలో సెలవురోజు కూడా రిజిస్ట్రేషన్లు ఆగలేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం, సోమవారాలు సెలవు దినాలైనా ప్రభుత్వం ప్రభుత్వ కార్యాలయాలు పనిచేయాలని ఆదేశాలు జారీ చేయడంతో పలు ప్రభుత్వ కార్యాలయాలు ఈ రెండు రోజులు పనిచేశాయి. ఇందులో భాగంగా మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆదివారం ఒక్కరోజే 24 రిజిస్ట్రేషన్లు జరగ్గా రూ.కోటి 1 లక్ష ఆదాయం వచ్చిందని, సోమవారం 18 రిజిస్ట్రేషన్లు జరగా 12 లక్షల రూపాయల ఆదాయం వచ్చిందని అధికారులు చెబుతున్నారు. భూములు, పొలాలు, ఇళ్ల రిజిస్ట్రేషన్లు భారీగా క్రయ విక్రయాలు జరిగాయి. ఆదివారం ఒక్కరోజే రూ.కోటికిపైగా ఆదాయం వచ్చింది. ఉగాది, ఆదివారం అయినప్పటికీ కొనుగోలు దారులు వెనక్కి తగ్గలేదు. ఆర్థిక సంవత్సరం చివరి రోజు కావడంతోసెలవు రోజుల్లో రిజిస్ట్రేషన్ కార్యాలయాలు పనిచేశాయి. దీంతో పొలాలు, స్థలాలు, ఇళ్లు భారీగా కొనుగోలు జరిగాయి. 2023–2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మంగళగిరి సబ్ రిజిస్టర్ కార్యాలయానికి 161 కోట్ల రూపాయలు ఆదాయం సాధించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. కాగా 142 కోట్ల రూపాయలు మాత్రమే లక్ష్యాన్ని పూర్తిచేశారు. అదే ఆర్థిక సంవత్సరంలో 15903 డాక్యుమెంటేషన్లు జరిగాయి. కాగా 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మంగళగిరి సబ్ రిజిష్టర్ కార్యాలయానికి 200 కోట్లు ఆదాయం సాధించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. ఆర్థిక సంవత్సరం పూర్తయ్యే నాటికి 176 కోట్లు లక్ష్యాన్ని మాత్రమే చేరుకున్నట్లు ఈ ఆర్థిక సంవత్సరంలో సుమారు 16 వేల డాక్యుమెంటేషన్లు జరిగినట్లు అధికారులు చెబుతున్నారు.

చివరి రోజు రూ.6.10 కోట్లు వసూలు

నెహ్రూనగర్: ఆస్తి పన్ను వడ్డీపై రాష్ట్ర ప్రభుత్వం మార్చి 25న ప్రకటించిన 50 శాతం రాయితీని గుంటూరు నగర ప్రజలు వినియోగించుకున్నారు. వడ్డీ రాయితో పన్ను చెల్లింపునకు చివరి రోజైన సోమవారం రూ.6.10 కోట్లు చెల్లించారు. వడ్డీ రాయితీ వినియోగించుకున్న నగర ప్రజలను నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు అభినందించారు.

కనిపించే ప్రగతికి స్వాగతం



గత ప్రభుత్వ హయాంలో ఆధునికీకరించిన లేబర్ రూం

- తెనాలి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో 35 శాతం వరకు సాధారణ కాన్పులు
- గత ప్రభుత్వ చర్యలతో ఒనగూరిన ప్రయోజనం
- సాధారణ ప్రసవాలకు వైద్యులు కృషి
- ప్రైవేటు ఆసుపత్రుల్లో 98 శాతం సిజేరియన్లు
- తగ్గించాలని కమిటీ ఆదేశం

తెనాలి: ప్రైవేటు ఆస్పత్రుల్లో కత్తెర కాన్పులు అధికమయ్యాయి. సాధారణ ప్రసవాలు కనిపించడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేసిన సమీక్షలో తేలిన అంశమిది. దీనిపై వైద్యాధికారులతో ఆస్పత్రుల్లో చేయించిన తనిఖీల్లో కఠోర వాస్తవాలు బహిర్గతమయ్యాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లో నూటికి 98 శాతం ప్రసవాలు సిజేరియన్లతోనే జరిగాయి. అయితే తెనాలిలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మాత్రం 35 శాతం వరకు సాధారణ కాన్పులు చేయగలిగారు. గత ఆర్నెల్లలో జరిగిన ప్రసవాలను సమీక్షించుకుంటే నిగ్గు తేలిన అంశమిది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో తీసుకున్న ముందస్తు చర్యలు ఇందుకు దోహదపడ్డాయి.

ప్రసవాల తనిఖీ

జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి, తెనాలి ఉప వైద్య, ఆరోగ్యశాఖ అధికారి ఇటీవల పట్టణంలోని ఐదు ప్రైవేటు ఆస్పత్రులు, సమీపంలోని మరో కార్పొరేట్ ఆస్పత్రిలో జరిగిన ప్రసవాలను తనిఖీలు చేశారు. ఆ ఆస్పత్రుల్లో నెలకు వంద వరకు ప్రసవాలు జరిగితే, అందులో రెండు మాత్రమే సాధారణ కాన్పులు. మిగిలిన 98 సిజేరియన్లే. తెనాలిలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో సగటున నెలకు 200 ప్రసవాలు జరిగాయి. గత ఆర్నెల్లలో 1200పైగా ప్రసవాలు జరిగితే అందులో 444 కాన్పులు సాధారణమే. అంటే దాదాపు 35 శాతం. దీంతో ప్రైవేటు ఆస్పత్రులు సాధారణ కాన్పులను ఎందుకు ప్రోత్సహించడం లేదని అధికారులు నిర్వాహకులను ప్రశ్నించారు. ఇకపై ఆదిశగా ప్రయత్నించాలని ఆదేశించారు.

సాధారణ ప్రసవాలపై గత ప్రభుత్వం దృష్టి

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో సాధారణ ప్రసవాలు ఎక్కువగా జరిగేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దృష్టి పెట్టింది. కేవలం ఆదేశాలతోనే సరిపెట్టకుండా అందుకు అవసరమైన చర్యలను తీసుకుంది. ఆస్పత్రిలోని లేబర్ రూమ్‌ను ఆధునికీకరించారు. పెయింట్ వేయించారు. ఏసీలు అందుబాటులోకి తెచ్చారు. లేబర్ రూంలో అవసరమైన టేబుల్స్ సమకూర్చారు. ఐదుగురు స్టాఫ్ నర్సులకు సాధారణ ప్రసవాలపై ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. వీటితోపాటు మహిళలకు గర్భిణి నిర్ధారణ కాగానే, రిజిస్ట్రేషన్ చేసి, కౌన్సెలర్‌తో కౌన్సెలింగ్ ఇప్పించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎక్సర్‌సైజులపై అవగాహన కల్పిస్తున్నారు. గర్భిణులు తీసుకోవాల్సిన ఆహారంపై డైటీషియన్ సూచనలు చేస్తున్నారు. ఓపీ హాలులోని టీవీలో ఎక్సర్‌సైజులు, ఆహారంపై ప్రసారాలు చేస్తున్నారు. ప్రసవం దగ్గర పడే వరకు ఇలాంటి జాగ్రత్తలు కొనసాగిస్తున్నారు. నొప్పులు మొదలుకాగానే లేబర్ రూంకు తీసుకెళతారు. ప్రసవ సేవలకు నలుగురు మెటర్నటీ అసిస్టెంట్లు, అనుభవజ్ఞులైన ముగ్గురు వైద్యులు అందుబాటులో ఉన్నారు. ఇన్ని చర్యల కారణంగానే ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ కాన్పులకు అవకాశం కలుగుతోంది.

తెనాలి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో గత ఆర్నెల్లలో జరిగిన ప్రసవాలు...

నెల	ప్రసవాలు మొత్తం	సిజేరియన్ కాన్పులు	సాధారణ కాన్పులు
అక్టోబరు	264	168	96
నవంబరు	276	165	111
డిసెంబరు	204	135	69
జనవరి	174	110	64
ఫిబ్రవరి	144	97	47
మార్చి 27వరకు	145	88	57
మొత్తం	1207	763	444



ఓపీ హాలులో టీవీ ప్రసారాలను వీక్షిస్తున్న గర్భిణులు

ఆశలారిపోయే

పెనుమూడి వారధి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

దేవుని సన్నిధిలో బిడ్డ ఊయల వేడుక కోసం బయలుదేరిన ఆ కుటుంబం ఆశలు ఆరిపోయాయి. రెప్పపాటులో ఎదురొచ్చిన మృత్యువు నలుగురిని బలితీసుకుంది. ముక్కుపచ్చలారని మూడునెలల పసికందునూ పొట్టనబెట్టుకుంది. కన్న తల్లిదండ్రులను, కడుపున పుట్టిన బిడ్డలను కోల్పోయి.. జీవిత భాగస్వామి తీవ్రగాయాలతో మృత్యువుతో పోరాడుతుంటే విషణ్ణవదనంతో లోలోన గుండెలవిసేలా రోదిస్తున్న క్షతగాత్రుడిని చూసి బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు. దేవుడా.. ఇదేమి అన్యాయం అంటూ విలపిస్తున్నారు. కృష్ణాజిల్లా పులిగడ్డ టోల్‌ఫ్లాజా వద్ద సోమవారం జరిగిన ఈ హృదయ విదారక ఘటన తెనాలి చెంచుపేట ఇందిరా నగర్‌లో విషాదఛాయలు నింపింది.



ప్రమాద స్థలిలో నుజ్జు నుజ్జయిన కారు



మరణించిన మూడునెలల బాలుడు

- కారును ఢీకొన్న లారీ
- ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం
- మృతుల్లో ఇద్దరు చిన్నారులు
- విషమంగా మరొకరి పరిస్థితి
- ఊయల వేడుక కోసం మోపిదేవి వెళ్తుండగా విషాదం
- మృతులు తెనాలి ఇందిరానగర్ వాసులు

తెనాలిరూరల్/అవనిగడ్డ: తెనాలి చెంచుపేట ఇందిరానగర్‌కు చెందిన గిడుగు రవీంద్ర మోహన్‌బాబు అలియాస్ రవి (55), అరుణ(50) భార్యాభర్తలు. మోహన్‌బాబు ప్రైవేటు ఎలక్ట్రీషియన్. వీరిది ప్రేమ వివాహం. వీరికి ఓ కూతురు, కుమారుడు ఉన్నారు. ఇద్దరికీ పెళ్లిళ్లయ్యాయి. కుమారుడు సందీప్ గుంటూరులో ప్రైవేటు ఉద్యోగం చేస్తూ తెనాలిలో తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. ఈయనకు భార్య పల్లవి, కూతురు సాత్విక(6), కుమారుడు షణ్ముఖ(మూడునెలలు)ఉన్నారు.







గిడుగు రవీంద్రమోహన్‌బాబు, అరుణ, సాత్విక (పాతచిత్రాలు)

షణ్ముఖ ఊయల వేడుక మోపిదేవి సుబ్రహ్మణ్యస్వామి సన్నిధిలో చేయాలని కుటుంబ సభ్యులు నిర్ణయించుకున్నారు. దీనికోసం సోమవారం మోహన్‌బాబు, అరుణ, సందీప్, పల్లవి, సాత్విక, షణ్ముఖ కారులో బయలుదేరారు. సందీప్ కారు నడుపుతుండగా మిగిలిన కుటుంబ సభ్యులు సరదాగా కబుర్లు చెప్పుకుంటున్నారు. పులిగడ్డ–పెనుమూడి వారధి దాటగానే టోల్‌ప్లాజా సమీపంలో ఎదురుగా వస్తున్న పామాయిల్ లోడుతో వస్తున్న లారీ ఒక్కసారిగా కారును ఢీకొంది. ప్రమాదంలో ముందు సీటులో కూర్చున్న మోహనబాబు, వెనుక సీటులో కూర్చున్న అరుణ, షణ్ముఖ అక్కడికక్కడే మరణించారు. సాత్విక తీవ్రంగా గాయపడి అపస్మారకస్థితికి చేరింది. వెనుక సీటులో తల్లి పల్లవి ఒడిలో ఉన్న మూడునెలల షణ్ముఖ ఎదరు సీటు తగలడంతో కుదపునకు సీటు కింద భాగంలోకి వెళ్లి పడి మరణించాడు. ప్రమాదం విషయం తెలియగానే హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకున్న ఎస్ఐ శ్రీనివాస్ తొలుత మోహన్‌బాబు, అరుణ మృతదేహాలను సిబ్బంది సాయంతో బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన సాత్వికను, పల్లవిని అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సీటు కింద పడి ఉన్న మూడునెలల షణ్ముఖను ఆ తర్వాత బయటకు తీశారు. సాత్వికను మెరుగైన చికిత్స నిమిత్తం మచిలీపట్నం తరలిస్తుండగా మరణించింది. పల్లవి పరిస్థితి విషమంగా ఉంది. ఆమెతోపాటు స్వల్పంగా గాయపడిన సందీప్‌ను విజయవాడలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

మరో ఐదు నిముషాల్లో గుడికి..

ప్రమాదం జరిగిన ప్రాంతం మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి మూడు కిలో మీటర్ల దూరంలో ఉంది. మరో ఐదు నిముషాలు గడిస్తే వారంతా ఆలయానికి వెళ్లి ఊయల వేడుక నిర్వహించేవారు. అంతలోనే ప్రమాదం జరిగి నలుగురు మృతిచెందారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది.

మద్యం మత్తులో ఆటోలను ఢీకొట్టిన కారు

- రెండు ఆటోల్లో 17మందిపైనే ప్రయాణికులు
- ఎనిమిది మందికి గాయాలు



ఘటనా స్థలంలో నుజ్జయిన ఆటో



క్షతగాత్రులను అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

చినగంజాం: మద్యం మత్తులో కారు నడుపుతూ ఎదురుగా వస్తున్న కూలీల ఆటోలను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఎనిమిది మందికి పైనే గాయాలపాలైన ఘటన సోమవారం సాయంత్రం చినగంజాం రొంపేరు బ్రిడ్జి వద్ద చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. చినగంజాం పల్లెపాలెం, చీరాల బోయనవారిపాలెం గ్రామానికి చెందిన పలువురు మహిళా కూలీలు నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు గ్రామంలో కూలీ పనుల కోసం వచ్చి సోమవారం సాయంత్రం పనులు ముగించుకొని ఆటోలలో ఇంటికి తిరిగి వెళ్తున్నారు. వారి ఆటోలు రొంపేరు బ్రిడ్జి సమీపానికి వచ్చేసరికి చీరాల నుంచి వస్తున్న ఏపీ 31 బీకే 1881 నంబరుతో ఉన్న కారులో డ్రైవర్ పూటుగా మద్యం సేవించి ఎదురుగా వస్తున్న కూలీల ఆటోను ఢీ కొట్టాడు. ముందు వెళ్తున్న బోయనవారిపాలెం ఆటోను బలంగా ఢీ కొట్టడంతో వెనుక ఉన్న ఆటో దానిని ఢీ కొట్టింది. వెనుక ఉన్న ఆటోలో మహిళా కూలీలకు స్వల్ప గాయాలు కాగా ముందు ఆటోలో ప్రయాణిస్తున్న మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ఒక వృద్ధురాలికి తీవ్ర రక్తస్రావం అయ్యింది. కారు, ఆటో డ్రైవర్‌లు అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో వైద్య చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. గాయాలపాలైన మహిళా కూలీలను చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కారులో ప్రయాణిస్తున్న బీహార్‌కు చెందిన శంశాద్ పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరు తరలించినట్లు తెలిపారు. ఆటోలో ప్రయాణిస్తున్న కొండేపి శివజ్యోతి కాలు విరిగినట్లు చీరాల ఔట్ పోస్టు ఏఎస్ఐ శ్యాం తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఆయన వివరించారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు



గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం నిమ్మకాయ క్వింటా ధర

కనిష్ఠం : రూ. 9,000 గరిష్ఠం : రూ. 12,300

మోడల్ ధర రూ. 10,600

క్లుప్తంగా

ఉండవల్లి చేరిన అయోధ్య రాముడి ధనస్సు శోభాయాత్ర



తాడేపల్లి రూరల్: గుంటూరు జిల్లా తెనాలికి చెందిన చల్లా శ్రీనివాస్ శర్మ అయోధ్య రామ మందిరానికి విరాళంగా కిలో బంగారం, 10 కిలోల వెండితో తయారు చేయించిన ధనస్సు అందజేశారు. ఈధనస్సు శోభాయాత్ర దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కార్యక్రమ నిర్వాహకులు కనపాని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం ఉండవల్లి గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం కొవ్వలజెట్టి కోదండ రామాలయంలో భక్తుల దర్శనార్థం ఆ ధనస్సును ఉంచారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ శర్మ మాట్లాడుతూ దేశంలో ప్రతి హిందువు ఈ ధనస్సును దర్శనం చేసుకునేందుకు వీలుగా శోభాయాత్రను చేపట్టినట్టు పేర్కొన్నారు. ఈ యాత్ర నవంబర్ నెలలో అయోధ్యకు చేరుకుంటుందని, ఈ ధనస్సును స్వామివారికి అలంకరణ చేస్తారని తెలిపారు. గంగోత్రి పీఠాధిపతి ఆద్వైతానంద మహరాజ్, గాడేమలం పీఠాధిపతి భక్తి సుందర్, మహామండలేశ్వర్ కృష్ణ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఈద్గాల వద్ద పటిష్ట బందోబస్తు



బాపట్లటౌన్: రంజాన్ పండుగను పురస్కరించుకుని ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు ముస్లిం ప్రార్థన ప్రదేశాలలో సోమవారం పోలీసులు పటిష్టంగా బందోబస్తు నిర్వహించారు. ఈద్గాల వద్ద ముస్లిం సోదరుల ప్రార్థనలకు ఎలాంటి ఆటంకాలు, అవాంతరాలు ఏర్పడకుండా బందోబస్తు చేపట్టారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టారు. కుల మతాల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ఎవరైనా సందేశాలు, వదంతులు వ్యాప్తి చేస్తే ఇటువంటి వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు సోషల్ మీడియాపై నిఘా ఉంచామని పట్టణ సీఐ రాంబాబు తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు.

రేపటి నుంచి 'స్లాట్ రిజిస్ట్రేషన్'

- పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపికైన గుంటూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం
- రిజిస్ట్రేషన్ కోసం ముందుగా ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలి



గుంటూరు ఎస్‌ఆర్‌ఓలో రిజిస్ట్రేషన్ కోసం వేచి ఉన్న ప్రజలు(ఫైల్)

గుంటూరు వెస్ట్: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రద్దీని తగ్గించేందుకు రాష్ట్ర స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయం కూటమి ప్రభుత్వ ఆదేశాలతో స్లాట్ బుకింగ్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ విధానం ఏప్రిల్ 2 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లా హెడ్‌క్వార్టర్‌లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అందుబాటులోకి రానుంది.

ప్రతి రోజూ 72 స్లాట్స్...

ఏదైనా ఆన్‌లైన్ కేంద్రంలో ముందుగా సంబంధిత రిజిస్ట్రేషన్‌కు సంబంధించి అనువైన, ఖాళీ ఉన్న సమయంలో స్లాట్ బుక్ చేసుకోవాలి. అందులో కేటాయించిన సమయంలో కార్యాలయానికి వెళ్లి వెంటనే రిజిస్ట్రేషన్ చేయించుకుని వెసులుబాటు ఉంటుంది. గుంటూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 72 స్లాట్స్‌ను ప్రతి రోజూ అందుబాటులో ఉంచారు. స్లాట్ బుక్ చేయకుండా రిజిస్ట్రేషన్ చేయడానికి అవకాశముండదని అధికారులు చెబుతున్నారు. నరసరావుపేటలో జాయింట్ సబ్ రిజిస్ట్రార్-1, బాపట్లలోని జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ స్లాట్ విధానం అందుబాటులో ఉంది. ముందుగా పైలెట్ ప్రాజెక్టును అమలు చేసి అందులోని ఇబ్బందులను అధిగమించి త్వరలోనే రాష్ట్రంలోని ప్రతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనూ అమలు చేయనున్నారు. స్లాట్ బుక్ చేసుకుని డాక్యుమెంట్లు మొత్తం సిద్ధం చేసుకుని ఎస్ ఆర్వో కార్యాలయంలోకి వెళ్లాల్సి ఉంటుంది.

అవగాహన కల్పిస్తాం

ఈ విధానం చాలా సులభతరం. స్లాట్ విషయంలో కొన్ని రోజులపాటు మేం ప్రజలకు అవగాహన కల్పిస్తాం. పెద్దగా ఇబ్బందులేమీ ఉండవు. గంటల కొద్దీ వేచి ఉండకుండా త్వరగానే రిజిస్ట్రేషన్ చేయించి పంపేందుకే ప్రభుత్వం ఈ నూతన విధానం అమలులోకి తెచ్చింది. ఇది పూర్తిగా ప్రజల సౌలభ్యం కోసమే.

– షరీఫ్ బాబు, జాయింట్ సబ్ రిజిస్ట్రార్-1, గుంటూరు

తెనాలి వైద్యశాలలో అరుదైన సర్జరీ

- తొడల మధ్యలో ఇరుక్కున్న ఆటో హ్యాండిల్‌ను తొలగించిన వైద్యులు
- వ్యక్తికి తప్పిన ప్రాణాపాయం



తొడల మధ్యలో ఇరుక్కున్న హ్యాండిల్‌తో వైద్యశాలకు వచ్చిన ఆటో డ్రైవర్ ప్రసాద్

తెనాలిఅర్బన్: రోడ్డు ప్రమాదంలో ప్రమాదవశాత్తు ఆటో హ్యాండిల్ రెండు తొడల మధ్య ఇరుక్కున్న ఓ వ్యక్తికి ఆపరేషన్ చేసి ప్రాణాపాయం తప్పించారు తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల వైద్యులు. సేకరించిన వివరాలు, వైద్యుల కథనం ప్రకారం.. తెనాలి పట్టణంలోని సుల్తానాబాద్‌కు చెందిన ప్రసాద్ (28) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం ఆటోనగర్ వైపు తన ఆటోలో వెళ్తుండగా ఎదురుగా వచ్చిన మరో వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో ప్రసాద్ నడుపుతున్న ఆటో హ్యాండిల్ అతని రెండు తొడల మధ్యలో ఇరుక్కుపోయింది. ఎంత సేపు ప్రయత్నించిన హ్యాండిల్ బయటకు రాకపోవడంతో స్థానికులు దానిని కట్ చేసి, అతడిని జిల్లా వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న సీనియర్ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ జి.హనుమంతరావు రంజాన్ పండుగ సందర్భంగా సోమవారం సెలవు అయినప్పటికీ హుటాహుటిన వైద్యశాలకు వచ్చారు. ఓపీ నుంచి ఆటో హ్యాండిల్‌తో ఉన్న ప్రసాద్‌ను థియేటర్‌కు తీసుకువెళ్లి అత్యవసర శస్త్ర చికిత్స చేశారు. రెండు తొడల మధ్యలో ఇరుక్కున్న హ్యాండిల్‌ను తొలగించడంతో పాటు లోపల దెబ్బతిన్న నరాలను కూడా సరిచేసి కుట్లు వేశారు. వెంటనే సర్జరీ చేయడం వలన ప్రాణాపాయం తప్పినట్లు వైద్యులు తెలిపారు. శస్త్ర చికిత్సలో ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ వెంకటేశ్వరరావు, ఎనస్థీషియా వైద్యులు డాక్టర్ యశస్విని, డాక్టర్ కిరణ్‌లు పాల్గొన్నారు. రోగి తరపు బంధువులు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

రేపల్లె నుంచి దూరప్రాంతాలకు సర్వీసులు నడపాలి

రేపల్లె రూరల్: తీరప్రాంతమైన రేపల్లె ఆర్టీసీ నుంచి వివిధ ప్రాంతాలకు ఆర్టీసీ సర్వీసులను నడపాలని పట్టణ ఆదర్శ వేదిక కార్యదర్శి యడ్లపల్లి కిషోర్‌బాబు విజ్ఞప్తి చేశారు. రేపల్లె ఆర్టీసీ అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరుతూ డిపో వద్ద నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణలకు సోమవారం వినతిపత్రం అందజేశారు. రేపల్లె - విశాఖపట్నం - శ్రీకాకుళం, రేపల్లె - మచిలీపట్నం - కాకినాడ - విశాఖపట్నం - శ్రీకాకుళం పోర్టు, రేపల్లె - తిరుపతి - బెంగళూరు, రేపల్లె - హైదరాబాద్ (బస్టాప్ కూడకున్న బస్సులు)లతో పాటు శ్రీశైలం, భద్రాచలం వంటి పుణ్యక్షేత్రాలకు సర్వీసులు నడపాలన్నారు. ఆదివరంగా మోపిదేవి మీదుగా చల్లపల్లికి మినీ సర్వీసులను ఏర్పాటు చేయాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఎన్.సాయికృష్ణమాచార్యులు, కొడాలి ఆనందరావు, నటరాజ్ ఉన్నారు.



మంత్రి అనగాని, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్లకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గుర్తు తెలియని వృద్ధుడి ఆత్మహత్య



వినుకొండ: శావల్యాపురం, వినుకొండ రైల్వే స్టేషన్ మధ్య రైలు పట్టాలపై గుర్తు తెలియని వృద్ధుడు సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. మార్కాపురం నుంచి రేపల్లె వైపు వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడి వయస్సు 70 సంవత్సరాలు ఉంటుందని, తెల్ల రంగు నిండు చేతుల చొక్కా, నీలం రంగు గళ్ల లుంగీ ధరించి ఉన్నాడని చెప్పారు.

వక్ఫ్ సవరణ చట్టంపై శాంతియుత నిరసన



నల్లరిబ్బన్లతో నిరసన వ్యక్తం చేస్తున్న ముఫ్తీ మునవర్, షేక్ మస్తాన్‌వలి తదితరులు

లక్ష్మీపురం: పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా ప్రశాంతమైన వాతావరణంలో ఈద్గాలు, మసీదులలో నమాజులు చేసుకునేందుకు వచ్చిన ముస్లింలు కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ అవలంబిస్తున్న వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా నల్ల రిబ్బన్లతో శాంతియుతంగా తమ నిరసనను వ్యక్తం చేశారు. స్థానిక నగరంపాలెంలోని ఈద్గాలో సోమవారం పవిత్ర రంజాన్ పర్వదినం సందర్భంగా జరిగిన ప్రార్థనల్లో ముస్లింలు వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా నల్ల రిబ్బన్లను ధరించి పాల్గొన్నారు. నమాజ్ అనంతరం కాంగ్రెస్‌పార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ పూర్వీకుల ఆస్తులను దోచుకుంటూ ఉంటే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. వక్ఫ్ ఆస్తులు ఎవరి బాబు గాడి సొత్తు కాదని, బ్రిటిష్ వారికి భయపడకుండా గుండె చూపించి దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన ముస్లిం సమాజాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాలన్నారు. ముస్లింలందరూ రాజ్యాంగం ప్రకారం మనకు సంక్రమించిన వక్ఫ్ ఆస్తులను కాపాడుకోవాలన్నారు. వక్ఫ్ ఆస్తులను దోచుకోవాలని చూసే దుర్మార్గులకు తగిన విధంగా రానున్న రోజుల్లో బుద్ధి చెప్పడం తథ్యమన్నారు. ముస్లింలందరూ ఐకమత్యంతో వక్ఫ్ సవరణ చట్టంకు వ్యతిరేకంగా శాంతియుతంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

ఏకాదండయ్య పంతులు జీవితం స్ఫూర్తిదాయకం

హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌ఆర్ఎల్ నాగేశ్వరరావు



రమణరావు, కమలవల్లి దంపతులను సత్కరిస్తున్న జస్టిస్ ఎన్‌ఆర్ఎల్ నాగేశ్వరరావు

గుంటూరు ఎడ్యుకేషన్: ఎనిమిది దశాబ్దాల క్రితం ఆన్నట్టి కాలమాన పరిస్థితుల కనుగుణంగా ట్రస్ట్ ఏర్పాటు చేసి విద్య, వైద్య, ఆధ్యాత్మిక, ఆదరణ గృహాల ద్వారా సమాజ హిత సేవలందించిన ఏకాదండయ్య పంతులు జీవితం వర్తమాన, భవిష్యత్ తరాలకు ఆదర్శప్రాయమని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎన్ఆర్ఎల్ నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఏకాదండయ్య పంతులు చారిటీస్ ఆధ్వర్యంలో సోమవారం అమరావతిరోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాల సుదర్శ ఆడిటోరియంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో భాగంగా శ్రీ విశ్వావసు నామ సంవత్సర పంచాంగాన్ని ఆవిష్కరించారు. రాళ్లబండి వెంకట సత్య రామానుజ శర్మ నూతన పంచాంగ శ్రవణం గావించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ ఏకాదండయ్య పంతులు బహుముఖ సేవలను కొనియాడారు. సభకు అధ్యక్షత వహించిన న్యాయవాది కొండూరి కృష్ణారావు మాట్లాడుతూ ఏకాదండయ్య పంతులు ధార్మిక సంస్థలను విరాళంగా మేనేజింగ్ ట్రస్టీ కోటంరాజు శేష చంద్రమౌళేశ్వరరావు నేతృత్వంలో మిగతా ట్రస్టీలు కాపాడుతూ సామాజిక సేవలందిస్తున్నారని కొనియాడారు. ప్రముఖ వైద్యులు వి.రమణరావు కమలవల్లి దంపతులను ఘనంగా సత్కరించి సన్మాన పత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక ట్రస్టీ కొండూరి నందకిషోర్, ట్రస్టీలు కెఎస్ఆర్ కుటుంబరావు, భట్రాజు కృష్ణ కిషోర్, కేసానుపల్లి వెంకట శ్రీరామ సుబ్బారావు, నెప్పల్లి వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ మార్చాలంటూ ధర్నా

- పండుగనాడు విద్యుత్ లేదంటూ ఆగ్రహం
- ఫిరంగిపురం సొలస బస్టాండు వద్ద గుంటూరు- కర్నూలు రోడ్డుపై ధర్నా



సొలస బస్టాండు వద్ద ధర్నా చేస్తున్న ముస్లిం పేట వాసులు

ఫిరంగిపురం: మండలకేంద్రం ఫిరంగిపురంలోని ముస్లింపేట వద్దనున్న జెండాచెట్టు వద్ద గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో నానా ఇక్కట్లు పడుతున్నామని దానిని మార్చాలంటూ ముస్లింపేట వాసులు సోమవారం సాయంత్రం సొలస బస్టాండు వద్ద రోడ్డుపై బైఠాయించారు. సేకరించిన వివరాల ప్రకారం.. ముస్లింపేట వద్ద ట్రాన్స్‌ఫార్మర్ సరిలేని కారణంగా విద్యుత్ సరఫరా తరచూ అంతరాయం కలుగుతుందని తెలిపారు. రంజాన్ పండుగ కావడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో నానా ఇబ్బందులు పడ్డామని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాత ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్తది ఏర్పాటుచేయాలని ఎన్నిసార్లు చెప్పినా ఆ శాఖ అధికారులు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సొలస బస్టాండువద్ద గుంటూరు - కర్నూలు రాష్ట్ర రహదారిపై బైఠాయించడంతో ఇరువైపులా వాహనాలు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి స్థానికులతో మాట్లాడారు. అనంతరం విద్యుత్‌శాఖ అధికారులతో ఫోనులో మాట్లాడటంతో ప్రస్తుతం విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. మంగళవారం నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేసి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చేస్తామని చెప్పడంతో ధర్నా విరమించారు.

ముగ్గురు గంజాయి విక్రేతలు అరెస్ట్



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న తాడేపల్లి సీఐ కల్యాణ్‌రాజు



స్వాధీనం చేసుకున్న గంజాయి

మూడు కిలోల గంజాయి స్వాధీనం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం, రాధారంగా నగర్, కొలనుకొండ ప్రాంతాల్లో నివాసముంటూ గంజాయి అమ్ముతున్న ముగ్గురు వ్యక్తులను తాడేపల్లి పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు. ఈసందర్భంగా సీఐ కల్యాణ్‌రాజు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, నార్త్‌జోన్ డీఎస్పీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు గంజాయి విక్రయాలు, కొనుగోలుపై దృష్టి సారించామని, వడ్డేశ్వరం, రాధారంగానగర్‌కు చెందిన ముత్యాల మనోజ్ కుమార్ ఏజెన్సీ ఏరియాల నుంచి గంజాయి తీసుకువచ్చి వడ్డేశ్వరంలో నివాసముంటున్న షేక్ అమీర్ బాషా, కొలనుకొండకు చెందిన ప్రవీణ్‌తో కలసి గంజాయి వ్యాపారం నిర్వహిస్తున్నారని సమాచారం వచ్చిందన్నారు. దీంతో వారిపై నిఘా ఏర్పాటు చేయగా ఎయిమ్స్ రోడ్‌లోని బ్రహ్మానందపురంకు వెళ్లే రహదారిలో ఈ ముగ్గురు గంజాయి అమ్మేందుకు ప్రయత్నించగా వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద ఉన్న 3 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచినట్టు ఆయన తెలిపారు. గంజాయి విక్రయంలో, సేవించే వారి సమాచారం పోలీసులకు తెలియజేయాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

ఎడ్ల పందేల్లో అపశ్రుతి

- బండ్ల లాగుడు పోటీల్లో కాలుజారి పందెపు ఎద్దుకు ఫ్రాక్చర్
- 1962 అంబులెన్స్ వాహనంలో గన్నవరం తరలింపు



అంబులెన్స్ వాహనంలోకి చేర్చిన పందెపు ఎద్దు

తెనాలి: స్థానిక మార్కెట్ యార్డులోని జరుగుతున్న ఆలపాటి శివరామకృష్ణయ్య జాతీయస్థాయి ఎడ్ల పందేల్లో మూడోరోజైన సోమవారం రాత్రి అపశ్రుతి చోటుచేసుకుంది. జిల్లాలోని సత్తెనపల్లి దగ్గరలోని కొమెరపూడి గ్రామానికి చెందిన యర్రా వెంకటేశ్వరరావు పందెపు ఎడ్ల జత బండలాగుడు పోటీల్లో పాల్గొన్నప్పుడు ఒక ఎద్దుకు కాలుజారి ఫ్రాక్చర్ అయింది. అక్కడే ఉన్న పశుసంవర్థకశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ (జేడీ) డాక్టర్ ఒ.నరసింహారావు పర్యవేక్షణలో పశువైద్యులు పరిశీలించి ప్రాథమిక వైద్యం చేశారు.

■ అత్యవసర శస్త్రచికిత్స కోసం గన్నవరంలోని పశువైద్య కళాశాలలోని సర్జరీ విభాగానికి తరలించాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. మొబైల్ వెటర్నరీ అంబులెన్స్ వాహనాన్ని రప్పించారు. తెనాలి వాహనంలో లిఫ్ట్ పనిచేయకపోవటంతో దుగ్గిరాల నుంచి 1962 మొబైల్ అంబులెన్స్‌ను పిలిపించారు. గాయపడిన ఎద్దును మొబైల్ వాహనంలోని లిఫ్ట్ సాయంతో అందులోకి ఎక్కించి, గన్నవరం తరలించారు.

■ మనుషులకు 108 అంబులెన్స్ వాహనం తరహాలోనే పశువులకు ప్రమాదం జరిగినప్పుడు అత్యవసర వైద్యసేవ కోసమని గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం 1962 మొబైల్ అంబులెటరీ వెటర్నరీ వాహనాలను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. గాయపడిన పశువుల వద్దకు నేరుగా వెళ్లి వైద్యం చేయటం, సాధ్యం కాకపోతే పశువును లిఫ్ట్ చేసి, ఆసుపత్రికి తరలించి వైద్యం చేసేందుకు వీటిని వినియోగిస్తున్నారు. ఇప్పుడు పొరుగు జిల్లాకు వెళ్లటం నిబంధనలకు విరుద్ధమైనా, పరిస్థితి తీవ్రతతో ఉన్నతాధికారులు, ఈమేరకు జేడీ డాక్టర్ నరసింహారావు ఫోనులో సంప్రదించి, వారి అనుమతితో తరలించారు. తెనాలి పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.నాగిరెడ్డి, డాక్టర్ జి.నరేంద్ర, ఆలపాటి వెంకట్రామయ్య, సిబ్బంది సహకరించారు.

దండకారణ్యంలో మారణకాండ ఆపాలి

పౌర హక్కులు, ప్రజా సంఘాల నాయకుల డిమాండ్



ఆర్టీసీ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న పౌరహక్కులు, ప్రజా సంఘాల నాయకులు

నరసరావుపేట: దండకారణ్యంలో మారణకాండను వెంటనే నిలిపివేసి సుప్రీం కోర్టు న్యాయమూర్తితో ప్రభుత్వం విచారణ జరిపించాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలకా చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో సోమవారం పౌర హక్కులు, ప్రజా సంఘాల నాయకులు నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇటీవల మధ్య భారతంలో, ముఖ్యంగా దండ కారణ్యంలో నిత్యం ఎన్‌కౌంటర్ పేరుతో ఆదివాసీలు, మావోయిస్టులను హత్యలు చేస్తున్నారని తెలిపారు. ఆయుధాలతో మావోయిస్టులు సంచరిస్తే వారిని అరెస్ట్ చేయాలన్నారు. వేలాది మంది సాయుధ బలగాలు చుట్టుముట్టి మట్టుపెట్టడం, ఆదివాసీలను, తుడిచేస్తాం అనే పదాలు రాజ్యాంగబద్ధం కాదని పేర్కొన్నారు. ఆరు నెలల పసి పిల్లలతో పాటు, యువకులు, మహిళలను పెద్దఎత్తున కాల్చి చంపడం, 2026 మార్చి 31 నాటికి అందరిని నిర్మూలిస్తామని హోం మంత్రి అమిత్‌షా బహిరంగ ప్రకటన చేస్తూ సవాల్ విసరడం చట్టవిరుద్ధం, న్యాయబద్ధం కాదని తెలిపారు. ఈశాన్య రాష్ట్రాల్లో మిలిటెంట్ సంస్థలతో కాల్పుల విరమణ ఒప్పందాలు చేసుకొని, వారి సమస్యలు పరిష్కరిస్తామని ప్రకటిస్తున్న పాలకులు మావోయిస్టులు, ఆదివాసీల విషయంలో వారిని నిర్మూలించడమే తమ లక్ష్యం అనడంలోని దుర్బుద్ధిని ఖండిస్తున్నామని వివరించారు. మధ్య భారతంలో ఉన్న ఖనిజాలు, అటవీ సంపదను తరలించుకుపోవటానికి అంబానీ లాంటి కార్పొరేట్లతో ఒప్పందాలు చేసుకున్నారన్నారు. వాటిని ఆపాలి అంటే ఆక్కడ వీరు అడ్డుగా ఉన్నారు, వారిని చంపడమే పరిష్కారమని పాలకులు భావిస్తున్నారని తెలిపారు. సుప్రీంకోర్టు డీలోఖ్ జోక్యం చేసుకొని న్యాయ విచారణకు ఆదేశించాలని ఆయన డిమాండ్ చేశారు. 2024 జనవరి నుంచి నేటి వరకు 500 మందిని చంపేశారని, తక్షణమే కాల్పుల విరమణ ప్రకటించి చర్చలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, పౌర హక్కుల సంఘం జిల్లా జాయింట్ సెక్రటరీ వినుకొండ పేరయ్య పాల్గొన్నారు.

'కొండవీటి కళారేఖ' కావ్యావిష్కరణ



ఆవిష్కరణలో కల్లి శివారెడ్డి తదితరులు

నరసరావుపేట ఈస్ట్: కొండవీడు పాలకుల సాహితీ సేవ, ప్రజారంజక పాలనను చారిత్రక పద్య కావ్యంగా తీసుకురావడం అభినందనీయమని కొండవీడు కోట అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కల్లి శివారెడ్డి తెలిపారు. శ్రీనాథ సాహితీ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో విశ్రాంత ప్రిన్సిపాల్, పద్యకవి డాక్టర్ పోలేపెద్ది మస్తానరెడ్డి రచించిన 'కొండవీటి కళారేఖ' చారిత్రక పద్య కావ్యాన్ని శివారెడ్డి ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ సాహితీలోకంలో డాక్టర్ చేరెడ్డి ప్రవరరాయని నిలిపోతారని కొనియాడారు. పుస్తక సమీక్షకులు డాక్టర్ పోలేపెద్ది రాధాకృష్ణమూర్తి, డాక్టర్ మళ్లవరపు భానుప్రసాదు మాట్లాడుతూ మస్తానరెడ్డి కలం పట్టి పద్యం రాయడం మొదలు పెట్టి 60 వసంతాలు నిండాయని తెలిపారు. ఆయన రచించిన 'అఖండ యోగి' పాఠకుల మన్ననలు పొందిందని పేర్కొన్నారు. కొండవీటి కావ్యరేఖ సైతం అందరి హృదయాలలో నిలిచిపోతుందని వివరించారు. అనంతరం గాయత్రి పరివార్ నత్తుంగ్, సంస్కృత సంధ్యా, సద్గురు కనకమణి ఆధ్వర్యంలో డాక్టర్ రెడ్డి మస్తాన్‌రెడ్డిని పద్య కలానిధి బిరుదుతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శ్రీనాథ సాహితీ పరిషత్ కార్యదర్శి నల్లా దినకరమూర్తి, ఆయన సహ ప్రతినిధులు డాక్టర్ పోపూరి గోపాలకృష్ణమూర్తి, డాక్టర్ వేదాంతం సత్య శ్రీనివాస అయ్యంగార్, పి.వి.ఎస్.ఆర్. ప్రసాదరావు పాల్గొన్నారు.